# ప్రజాశక్తి

ఆదివారం 26 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఆసరా చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## మహిళల ఆర్థిక సాధికారతకు కృషి

- స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వం అండ
- ఆసరా చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా అర్హుల బ్యాంకు ఖాతాలలో నేరుగా ఈ నిధులను జమ చేసే మూడో విడత రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఇందుకు అనుబంధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కులను వారు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడతలో జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కలిపి 36,769 స్వయం సహాయక సంఘాలలోని 3,59,506 మంది సభ్యులకు రూ.280.50 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ దిశగా ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధులను మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకోవాలని ఆయన ▶ 2లో

## నష్టపరిహారం అడిగితే..
# కూలగొట్టారు..

- '3వ రైల్వే లైన్' బాధితుల ఆందోళన
- రోడ్డుపై పడి విలపించినా కనికరించని అధికారులు

జేసీబీతో షెడ్డును కూల్చేస్తున్న దృశ్యం, ఇన్‌సెట్లో రోడ్డుపై పడి విలపిస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలోని పాకల రైల్వే గేటు వద్ద 3వ లైన్ నిర్మాణంలో నష్టపరిహారం చెల్లించాలని అడుగుతుంటే.. తప్పుడు లెక్కలతో పూర్తిగా పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గట్టిగా అడిగితే శనివారం నాడు జెసిబిలతో కూల్చి వేశారని బాధితులు బోరున విలపించారు. మూడో రైల్వేలైన్ నిర్మాణం పనుల్లో భాగంగా పాకల రైల్వేగేటు వద్ద తానికొండ శోభన శ్రీనివాసరావు అనే వ్యక్తులది కనకదుర్గ లాండ్రీ సర్వీస్ ఇండస్ట్రీ ఉంది. రైల్వే మూడో లైన్‌లోకి స్థలం పోతుంది 18 సెంట్లు స్థలంలో షెడ్డు నిర్మాణం చేపట్టుకొని నాలుగు రూములు వేసుకొని లక్షల విలువ చేసే మిషనరీలతో ఈ ఇండస్ట్రీ నడుస్తుంది. సుమారు కోటీ 80 లక్షల రూపాయలు దీని విలువని ఇండస్ట్రీ నిర్వాహకులు అధికారులకు చెప్పారు. అయితే అధికారులలో చలనం లేకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి రూ.50 లక్షలు ఇస్తామని వివరించారు. తాను భారీగా నష్టపోతానని, తనకు న్యాయం చేయాలని శింగరాయకొండ తహశీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అర్జీలతో మొరపెట్టుకున్నారు. అధికారులు వచ్చి న్యాయం చేస్తామని వెళ్లిపోయారు. అయితే శనివారం నాడు రైల్వే అధికారులు షెడ్డును కూల్చేందుకు జెసిబితో రంగప్రవేశం చేశారు. దీంతో శోభనా శ్రీనివాసరావు కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. రైల్వే అధికారులు మాత్రం పగలగొట్టి రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని చెబుతున్నారు. విషయం తెలుసుకున్న శింగరాయకొండ తహాశీల్దార్ సిహెచ్.ఉష అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. కొలతలు వేయటంలో తమకు ఇబ్బంది జరిగిందని, మరోసారి రీ సర్వే చేసి తమకు న్యాయం చేయాలని శ్రీనివాసరావు కోరారు. మరోసారి రీ సర్వే చేయడానికి ప్రస్తుతం సమయం లేదని, ▶ 2లో

ఒంగోలులో బాపనయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## ప్రజా పోరాట యోధుడు బాపనయ్య

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు ▶ 5లో

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## జగనన్న కాలనీల్లో
# గృహ నిర్మాణాలు వేగవంతం

### బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

బాపట్ల మున్సిపాలిటీలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్యాడ్ సన్ పేట జగనన్నకాలనీలో జరుగుతున్న గహనిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల మున్సిపాలిటీ ప్యాడ్ సన్ పేట జగనన్న కాలనీ 1740 గృహాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం1409 గహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ప్రారంభించని గహ నిర్మాణ లబ్ధిదారులకు 2.90 లక్షల రూపాయలతో మోడల్ హౌస్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గహ నిర్మాణాలను ప్రారంభించడానికి అవసరమైన బ్యాంక్ రుణాలను ఇప్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్యాడ్ సన్ పేట జగనన్న కాలనీలో అంతర్గత రోడ్డు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గహ నిర్మాణాలు నిర్మించుకోవడానికి ఉత్సాహం చూపని లబ్ధిదారుల ఇంటి పట్టాలు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇమ్మడిశెట్టివారిపాలెం, ఇస్లాంపేటకు చెందిన వార్డు వాలంటీర్లు గహ నిర్మాణాలకు సహకరించడం లేదని వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, తహాశీల్దార్ కవిత పాల్గొన్నారు.

# వైద్యులు సేవాగుణంతో పనిచేయాలి

### కలెక్టర్ దినేష్‌కుమార్

వైద్య విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

వైద్యులు సేవా గుణంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఎం.బీ.బీ.ఎస్. కోర్సు, హౌస్ సర్జన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేయడానికి శనివారం రాత్రి జీ.జీ.హెచ్. ప్రాంగణంలో నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 100 మందికి డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పేదలకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లేనని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన అన్నారు. వైద్య రంగంలో వస్తున్న వినూత్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంతటితో ఆగిపోకుండా స్పెషలైజేషన్ కోర్సులు చదవడం పైనా దష్టి పెట్టాలని చెప్పారు. భారత వైద్య రంగం సత్తా ఏంటో కరోనా సమయంలో యావత్ ప్రపంచం గుర్తించిందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని, ఉద్యోగ జీవితాన్ని బాలెన్స్ చేసుకుంటూ నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సల్మాన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, జి.జి.హెచ్. సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, డాక్టర్ కేశవ్, డాక్టర్ జీవన్, తదితరులు పాల్గొన్నారు. వైద్య రంగానికి సంబంధించిన మెళకువలపై పట్టభద్రులకు వీరు అవగాహన కల్పించారు.

## నష్టపరిహారం అడిగితే..కూలగొట్టారు

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయం కోర్టులో ఉండడంతో అక్కడ పరిష్కారం జరుగుతుందేమో చూడాలని తహశీల్దార్ వివరించారు. ఇంత ఆందోళన జరుగుతున్నప్పటికీ, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని బోరున విలపిస్తున్నప్పటికీ రైల్వే అధికారులు షెడ్డును జెసిబితో కూల్చివేశారు. రెవెన్యూ అధికారుల సర్వేలో తప్పులు ఇవ్వడం వల్ల తాను నష్టపోయానని, తనను, తన కుటుంబాన్ని ఆదుకోవాలని శ్రీనివాసరావు బోరున విలపించారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఆసరా పథకంలో జిల్లాలో మొదటి విడతలో 35,701 స్వయం సహాయక సంఘాలలోని 3,51,376 మంది సభ్యులకు రూ.267.54 కోట్లను, రెండవ విడతలో 36,721 స్వయం సహాయక సంఘాలలోని 3,59,027 మంది సభ్యులకు రూ.291.68 కోట్లను ప్రభుత్వం అందించినట్లు ఆయన వివరించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ ముందంజ వేసేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా వారికి ప్రయోజనం కల్పించడంతో పాటు ప్రజా సేవలోనూ వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలను మాఫీ చేయడంతో పాటు కొత్తగా సున్నా వడ్డీకే రుణాలు ఇస్తూ మహిళల జీవితాలలో ముఖ్యమంత్రి సంతోషాలు నింపుతున్నారన్నారు. మెజారిటీ సంక్షేమ పథకాలను మహిళల పేరిటే అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ బి.బాబూరావు, మెప్మా పీడీ టి.రవి కుమార్, ఎల్‌డిఎం యుగంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-కొత్తపట్నం**

కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో కేజీబీవీ స్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బాల్యవివాహాల నివారణపై కేజీబీవీ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నివారణ, టీనేజీ గర్భధారణ, బాల్య వివాహాలపై అవగాహన, బాల బాలికలపై లైంగిక వేధింపులు, బాలల హక్కులను ప్రోత్సహించటం, గృహహింస నిరోధక చట్టంపై ప్రతిరోజు స్కూల్ అసెంబ్లీలో ప్రతిజ్ఞ చేయిస్తామని తెలిపారు. అలాగే ఈ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు, ప్లకార్డులు, పోస్టర్లు, చార్ట్స్ ఎగ్జిబిషన్ తదితర వంటివి నిర్వహించామని, అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని కేజీబీవీ స్కూల్ ఎస్ఓ అరుణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో ఐ క్యాంపు

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో, జంపని కోటేశ్వరరావు సహకారంతో మార్టూరు మండలం చింతపల్లిపాడు గ్రామంలో శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 120 మందిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కొర్రపాటి ఖాజారావు, సెక్రటరీ కుర్ర వెంకటరామయ్య, డాక్టర్ కొర్రపాటి సుబ్రహ్మణ్యం, యూత్ ఛైర్మన్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు, జాష్టి కోటేశ్వరరావు ఎన్విరాన్మెంటల్ ఛైర్మన్ చెన్నుపాటి బసవరాములు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## 28న ఆసరా సమావేశం

**ప్రజాశక్తి-పర్చూరు:** పర్చూరు మండలం 3వ విడత ఆసరా సమావేశం ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఏపిఎం లాజరు తెలిపారు. పర్చూరు మార్కెట్ యార్డులో సమావేశం జరుగుతుందని వివరించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

పర్చూరులో శనగల కొనుగోలు ప్రారంభిస్తున్న దృశ్యం

## శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-పర్చూరు:**

పర్చూరు మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ బోడవాడ అధ్యక్షులు కామిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడిఏ మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు శనగలను మద్దతు ధరకు అమ్ముకోవాలంటే నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ముఖ్యంగా తేమ శాతం 14, వ్యర్థపదార్థాలు 1 శాతం, ఇతర ధాన్య గింజలు 3 శాతం, కల్తీ గింజలు 2 శాతం, రంగుమారిన, విరిగిన గింజలు 4 శాతం, ముతక గింజలు 3 శాతం, పూర్తిగా తయారు కాని గింజలు 6 శాతం మరియు పురుగు పట్టిన గింజలు 4 శాతం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. రైతులు శనగలను డీ స్టోన్ చేసుకొని తెచ్చుకోవాలన్నారు. క్వింటా ధర రూ.5,335 మద్దతు ధరగా ప్రకటించారు. మార్కెఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో 10 రోజుల్లో నగదు జమచేస్తారని వివరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ పర్చూరు అధ్యక్షులు కుక్కపల్లి నాగేశ్వరరావు, పిడిసిసి బ్యాంకు సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పిఎసిఎస్ బోడవాడ సిఇఓ కె రత్నకుమారి, పిఎసిఎస్ బోడవాడ కమిటీ పర్సన్స్ ఎం రాఘవయ్య, కోట శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగ్గురు జూనియర్ ఇంటర్ విద్యార్థుల డీబార్

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

మండల పరిధిలోని పొన్నపల్లి గీతం జూనియర్ కాలేజీలో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలలో ముగ్గురు విద్యార్థులను డిబార్ చేశారు. ఇద్దరు ఫిజిక్స్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు, ఒక ఎకనామిక్స్ తెలుగు మీడియం విద్యార్థిని డిబార్ చేశారు. హైపవర్ కమిటీ సభ్యులు బి కృష్ణారెడ్డి, శేఖర్‌బాబు, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న విద్యార్థులను డిబార్ చేశారు. శనివారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 342 మంది విద్యార్థులకు గాను 329 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని మరొక సెంటర్ కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 337 మంది విద్యార్థులకు గాను 328 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సర పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

## పది పరీక్షలకు మెటీరియల్ అందజేత

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

వేమూరు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాల్మన్‌రాజ్ ప్యాడ్‌లు, పెన్నులు ఇతర సామగ్రిని మండలంలోని వెల్లటూరు, పెసర్లంక తదితర పాఠశాలల్లో అందించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సాల్మన్‌రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాన్నం సురేష్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించండి

**ప్రజాశక్తి-రేపల్లె**

పశువులకు, జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పక వేయించాలని రేపల్లె ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి నరేంద్రబాబు పాడి రైతులకు సూచించారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో శనివారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులు పశువులు, జీవాలకు చెవి కమ్మలు తప్పక వేయించాలని ఆయన తెలిపారు. గ్రామంలో 24 తెల్ల పశువులకు, 76 గేదెలు, దూడలకు టీకాలు వేశామని అన్నారు. కార్ర్యమంలో గ్రామ సర్పంచ్ దారం విజయ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, గోపాలమిత్రలు రత్నం, బాబురావు, ఏహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఓ.ఎస్.నెం. 150/2022**

**బిట్వీన్:**

గోలుగూరి శ్రీనివాసరెడ్డి, తండ్రి: సత్తి రెడ్డి, R/o. పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా, పిన్: 533343

**...వాది**

**మరియు**

దాసరి అనుపమ, భర్త: సురేష్, డో.నెం. 56-1-6/55, బాలాజీ నగర్, అగ్రహారం రోడ్, పోతురాజు పాలెం, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్: 523 001.

**...ప్రతివాది**

పై నెంబరు దావా గ్రంథమునకు గాను ప్రతివాది హాజరు నిమిత్తం మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు /నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకంగా సదరు కోర్టు సమన్లు /నోటీసులు త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.27-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు దావాను మీకు పరోక్షమంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)**

**టి.వి.వి.రమణమూర్తి,** అడ్వకేట్,
దుప్పలపూడి. సెల్: 96527 36367

**CHANGE OF NAME & D.o.B.**

I, BIJJAM RAMALAKSHAMMA Mother of Army No. 16114974F, Rank: L/NK, BIJJAM SAMBA SIVA REDDY, R/o D.No. 5-33/A, Kalagotla (V & Post), Besthavaripeta(Mdl), Prakasam Dist., A.P.-523 370, hereby declare that I have changed my name & Date of Birth from B. RAMALAXMAMMA(01.07.1964) to **BIJJAM RAMALAKSHAMMA (01.01.1962)** as per Aadhar card.

**CHANGE OF NAME & D.o.B.**

I, BIJJAM RAMI REDDY Father of Army No. 16114974F, Rank: L/NK, BIJJAM SAMBA SIVA REDDY, R/o D.No. 5-33/A, Kalagotla (V & Post), Besthavaripeta(Mdl), Prakasam Dist., A.P.-523 370, hereby declare that I have changed my name & Date of Birth from RAMI REDDY(01.07.1961) to **BIJJAM RAMI REDDY(01.09.1958)** as per Aadhar card.

**మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No.232/2021**

**సాదినేని చెంచులక్ష్మి** ... వాది
Vs
**తల్లపనేని రంగనాయకమ్మ**
మరియు ఇతరులు ... ప్రతివాదులు

To,
D3.**తొట్టెంపూడి పద్మ,** భర్త **చంద్ర,**
తండ్రి లేట్ పెద్ద **చెంచులు,**
R/o శానంపూడి గ్రామం,
సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా. ఎ.పి.

పై నెంబరున వాది మీ మీద దావా పరిహారములకు డిక్రీ కోరుచూ దావా దాఖలు చేసినందుకు మీకు దావా సమను నిమిత్తం **తేది 06-04-2023** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **06-04-2023**
కందుకూరు

**వై.సాంబశివరావు**
వాది తరుపు అడ్వకేటు
కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా, ఏ.పి.

**మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**I.A.No.734/2021**

**O.S.No.232/2021**

**సాదినేని చెంచులక్ష్మి** ... పిటీషనర్ / వాది
Vs
**తల్లపనేని రంగనాయకమ్మ**
మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

To,
R3.**తొట్టెంపూడి పద్మ,** భర్త **చంద్ర,**
తండ్రి లేట్ పెద్ద **చెంచులు,**
R/o శానంపూడి గ్రామం,
సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా. ఎ.పి.

పై నెంబరున పిటీషనర్/వాది మీ మీద (U/o.39, R-1 & 2 of C.P.C) పిటీషన్ పరిహారముల నిమిత్తం పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం **తేది 06-04-2023** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **06-04-2023**
కందుకూరు

**వై.సాంబశివరావు**
పిటీషనర్ / వాది తరుపు అడ్వకేటు
కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా, ఏ.పి.

**ఆర్.ఓ.సి.నెం. 05/2023**

**గ్రామ పంచాయతీ కార్యాలయము,**
**దేవాంగపురి,**
**24.03.2023.**

**బహిరంగ వేలం నోటీసు**

| | | |
|---|---|---|
| 1.దేవాంగపురి గ్రామ పంచాయతీకి చెందిన 2023-24 అనగా తేది.01.04.2023 నుండి 31.03.2024 వరకు కూరగాయల మార్కెట్టు దినసరి రుసుములు వసూలు చేసుకొను హక్కు పొందుటకు | తేది.27.03.2023 మధ్యాహ్నం 03.00లకు | కూరగాయల మార్కెట్టు రూ.1,80,000/- సాల్వెన్సు/బ్యాంకు గ్యారెంటి/లేక రూ. 1,80,000/-నగదు మరియు ధరావత్తు రూ.50,000/-లు వేలం జరుగు సమయంలో అందజేయవలేను. |
| 2.దేవాంగపురి గ్రామ పంచాయితీకి చెందిన 2023-24 అనగా తేది. 01.04.2023 నుండి 31.03.2024 వరకు జంతువధశాలలు దినసరి రుసుములు వసూలు చేసుకొను హక్కు పొందుటకు | తేది. 27.03.2023 మధ్యాహ్నం 03.00లకు | జంతువధశాలలు రూ.1,80,000/- సాల్వెన్సు/బ్యాంకు గ్యారెంటి/లేక రూ. 1,60,000/-నగదు మరియు ధరావత్తు రూ.50,000/-లు వేలం జరుగు సమయంలో అందజేయవలేను. |
| 3.దేవాంగపురి గ్రామ పంచాయతికి చెందిన 2023-25 అనగా తేది. 01.04.2023 నుండి 31.03.2025 వరకు పంచాయతీ పరిధిలో గల కూరగాయల మార్కెట్ ప్రక్కన ఉన్నదక్షణం వైపు ఉన్న షాపు నెం.1 | తేది. 27.03.2023 మధ్యాహ్నం 03.00 లకు | ప్రతి షాపు రూ.50,000/- సాల్వెన్సు /బ్యాంకు గ్యారెంటి/లేక రూ.50,000/- నగదు మరియు ధరావత్తురూ.10,000/-లు ప్రతి షాపుకి వేలం జరుగు సమయంలో అందజేయవలెను. |
| 4.దేవాంగపురి గ్రామ పంచాయతీకి చెందిన 2023-25 అనగా తేది. 01.04.2023 నుండి 31.03.2025 వరకు పంచాయతీ పరిధిలో గల కూరగాయల మార్కెట్ ప్రక్కన ఉన్న దక్షణం వైపు ఉన్న షాపు నెం.2 | తేది. 27.03.2023 మధ్యాహ్నం 03.00 లకు | ప్రతి షాపు రూ.50,000/- సాల్వెన్సు /బ్యాంకు గ్యారెంటి/లేక రూ.50,000/- నగదు మరియు ధరావత్తు రూ.10,000/-లు ప్రతి షాపుకి వేలం జరుగు సమయంలో అందజేయవలెను. |

గ్రామ పంచాయతీ కార్యాలయము నందు జరుగు వేలం పాట వివరములు/ నిబంధనలు కార్యాలయము పని దినములలో పంచాయతీ కార్యదర్శి/జూనియరు సహాయకులు వారి నుండి అడిగి తెలుసుకోనవచ్చును.

**పంచాయతీ కార్యదర్శి,**
**గ్రామ పంచాయతీ, దేవాంగపురి,**

<u>గమనిక:</u> బహిరంగ వేలము పాటలు వాయిదా వేయు అధికారము పంచాయతీ కార్యదర్శి వారికి కలదు.

# మందుబాబులం.. మేము మందుబాబులం

**ప్రభుత్వ హాస్పటల్ కార్యాలయంలో మద్యపానం ● డ్యూటీ డాక్టర్, యుడిసి, హెల్త్ సూపర్‌వైజర్ల హంగామా ● ఎస్ఐ, డిఎంఅండ్‌హెచ్ఒలకు ఫిర్యాదు**

**ప్రజాశక్తి-వేటపాలెం**

రోగులకు వైద్యం అందించి మన్ననలు పొందాల్సిన డాక్టర్, ఇటీవల హెల్త్ అసిస్టెంట్ నుంచి సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ పొందిన ఉద్యోగి, కార్యాలయ యుడిసి మొత్తం ముగ్గురు. మండలంలోని బండ్ల ఆదెమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉద్యోగులు. ఎక్కడా చోటు దొరకలేదేమో.. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం మూడు గంటల వరకు హాస్పటల్ కార్యాలయంలో సిట్టింగ్ వేశారు. మందుబాబుల అవతారమెత్తి ఎంచక్కా మద్యం సేవించారు. మద్యం కిక్కు తలకెక్కాక గావుకేకలు వేశారు. ఆ రణగొణ ధ్వనులను గుర్తించిన స్థానికులు నేరుగా వేటపాలెం ఎస్ఐ సురేష్‌కు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కానిస్టేబుల్స్‌ను పంపారు. పోలీసులు నేరుగా హాస్పటల్‌కు వెళ్లి విచారించి నేరుగా కార్యాలయంలోకి వెళ్లారు. మందుబాబులు పోలీసుల కాళ్లావేళ్లాపడి కార్యాలయం నుంచి బయటపడ్డారు. ఆఫీసు ఎదురుగా ఉన్న చెట్టు నీడలో

సేదతీరారు. డాక్టర్ మఫ్టీలో ఉండడాన్ని గమనించి కొందరు నాయకులు ప్రశ్నించారు. మరి కొందరు నాయకులు తమ ఫోన్లలో ఫొటోలు తీసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. పోలీసులు జరిగిన సంఘటన గూర్చి సాదారణంగా తీసుకోవడం పట్ల స్థానికులు పెదవి విరిచారు. వేటపాలెం ఎస్ఐ సురేష్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా తనకు ఫోన్ వచ్చిన మాట వాస్తవమేనని అన్నారు. హాస్పటల్‌లో ఏరియాలో మద్యం సేవిస్తున్న వారి గురించి ఫోన్ రాగానే మా సిబ్బందిని పంపించాను. అక్కడ ఎవరూ లేరని చెప్పారని తెలిపారు. ఈ సంఘటన గూర్చి స్థానిక మండల జడ్‌పిటిసి బండ్ల తిరుమలాదేవి నేరుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గత మూడు నెలల క్రితం ఉమ్మడి జిల్లా విద్య వైద్య స్టాండింగ్ కమిటీ మెంబర్ బండ్ల తిరుమలాదేవి.. డాక్టర్ ప్రభాకర్‌రావు వలన వైద్యశాలకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిటీ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు గురించి డిఎంఅండ్‌హెచ్ఒ ఇప్పటివరకు కనీస విచారణ చేయకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన డిసిహెచ్ నిధుల్లో కూడా లెక్కకు మించి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమాల గురించి, డాక్టర్ ప్రవర్తన గురించి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

## యానాది కార్పొరేషన్ ఏర్పాటుకు చంద్రబాబు హామీ

**ప్రజాశక్తి-కొత్తపట్నం**

రాష్ట్రంలో యానాది కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాజీ ముఖ్య మంత్రి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు కత్తి పద్మ తెలిపారు. శుక్రవారం కొత్తపట్నంలోని చాకిరేవు మెట్ట, మోటు మాలోని కోళ్లఫారం వద్ద గల యానాది కాలనీలో విస్తృతంగా పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కత్తి పద్మ మాట్లాడుతూ ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు మండ లంలోని అన్ని యానాది కాలనీలో పర్యటించడం జరుగుతుందన్నారు. ఇటీవల కోవూరు సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యానాది కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పా టు చేస్తానని హామీ ఇచ్చారని ఆ విషయాన్ని నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలో ఉన్న యానాదులకు తెలియపరుస్తున్నామన్నారు. యానాదులను సంఘటితం చేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఒంగోలు

కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కత్తి పద్మ

నియోజకవర్గంలో గతంలో చేసిన అభివృద్ధి, రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు ఆయన పుణ్యమేనని ఆమె యానాదులకు వివరించారు. పార్టీ మహిళా అధికార ప్రతినిధి తిరుపతి నియోజకవర్గానికి చెందిన కళావతి మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ హయాంలోనే యానా దులు అభివృద్ధి చెందారని, ఆ విషయాన్ని మర్చిపోకూడదని అన్నారు. కాలనీలలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే వెంటనే స్పందించి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని మహిళా ప్రతినిధులు యానాదులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వరమ్మ, ఒంగోలు నియోజకవర్గ అధికార ప్రతినిధి పొన్నం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన చైతన్య

**ప్రజాశక్తిలి-బల్లికురవ రూరల్**

అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని కొమ్మినేని వారిపాలెం, అంబడిపూడి గ్రామాల్లో

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బాచిన కృష్ణచైతన్య

గురువారం కురిసిన అకాల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలను పంట నష్టం అంచనాల నివేదికను తయారుచేసి ఉన్నత అధికారులు పంపించాలని సూచించారు. మండల పరిధిలో సుమారు 550 హెక్టార్లలో మొక్కజొన్న పైరు దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్‌విపి కుమారి, చైతన్యకు తెలిపారు. అంతేకాకుండా వరి, అరటి, బొప్పాయి, మిరప దెబ్బతిన్న తదితర పంటల వివరాలను, ఈ క్రాప్ట్ నమోదు ద్వారా ఏయే పంటలకు నష్టపరిహారం వస్తుందో ఆ పంటల వివరాలను ఏవో చైతన్యకు వివరించారు. ఎకరాకు 25 వేల రూపాయల నుండి 35 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టామని అకాల వర్షంతో పూర్తిగా నష్టపోయామని రైతులు చైతన్య ముందు వాపోయారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలాగా చూడాలని కోరారు. ఈయన వెంట తహాశీల్దారు సీతారత్నం, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షుడు దర్శి రామకృష్ణయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు టి నరేష్, దివ్య రామాంజనేయులు, రైతులు తదితరులు ఉన్నారు.

## మెరిట్ స్కాలర్‌షిప్ ఫలితాలలో.. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం

**ప్రజాశక్తి-బల్లికురవ రూరల్**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్షిప్ ఫలితాలలో కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన మాదాల హేమ స్రవంతి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. శుక్రవారం ఈ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన మొత్తం ఏడుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్రవంతితోపాటు వి జాయే ప్రిన్స్, ఎం అక్షయభాయ్, ఎం రూపాభాయ్, కే అంజని, జాహ్నవి, కె వెంకట వైష్ణవి ఈ పథకానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ దమ్ము అంజయ్య, గ్రామ సర్పంచి బండారు వెంకయ్యమ్మ గురవయ్య, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విజయరోజ్ రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించి బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన స్రవంతిని, ఆమె తల్లిదండ్రులను సన్మానించడంతో పాటు మిగతా విద్యార్థులను కూడా అభినందించారు. ఏడాది కాలం పాటు స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు 12 వేల రూపాయలు ఉపకార వేతనం అందనుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ పాఠశాలను తలదన్నే రీతిలో

స్రవంతిని, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే దృఢ సంకల్పంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కిట్లు లాంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. తద్వారా ప్రతి ఒక్కరు అత్యుత్తమ విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను, గ్రామ పెద్దలు అభినందించారు.

**సంతనూతలపాడు రూరల్:** స్థానిక ఎస్ఎస్‌కేసిఎం జడ్పీ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం

స్రవంతి

అంజలిగౌతమి, కే రుషిత, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించారు. స్కాలర్షిప్‌నకు అర్హత సాధించిన అంజలిగౌతమి, రుషిత వారికి ప్రత్యేక శిక్షణను ఇచ్చిన గణిత ఉపాధ్యాయురాలు రజినిలను పాఠశాల హెచ్ఎం పి రామారావు ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

**మద్దిపాడు:** ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఇనమనమెళ్లూరు జడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు ఎంపిక అయినట్లు హెచ్ఎం బి వసుంధరాదేవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన, ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలకు పాఠశాల నుంచి 12మంది 2023, ఫిబ్రవరి 5వ తేదీ ఒంగోలులో హాజరయ్యారు. వారిలో బి రామాంజమ్మ, వై సుప్రియ, జి సుప్రియ, శివశంకర్, గాలం సాయి, పూర్ణిమ, లక్ష్మి భువనకృతి ఎంపిక అయినట్లు తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు సంత్సరానికి రూ.12,000 చొప్పున 4 సంత్సరాలకు రూ.48,000 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరిని హెచ్ఎం, బోధన బోధనేతారసిబ్బంది, గ్రామ పెద్దలు అంజిరెడ్డి తదితరులు అభినందించారు.

## వరికూటి అశోక్‌బాబుకు మాతృవియోగం

**ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్**

కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి వరికూటి కోటమ్మ(83) వయోభారంతో శనివారం ఉదయం ఆమె రెండో కుమారుడు ఇంటి వద్ద కాకినాడలో మృతి చెందారు. వరికూటి కోటమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతల పాడు, చీమకుర్తి, మద్దిపాడు మండలాల్లో వీడీవోగా పనిచేశారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారిలో ఇద్దరు వైద్య వృత్తిలోనూ, ఒకరు బ్యాంకు మేనేజర్ గానూ, మరొకకరు పోస్టల్ ఉద్యోగిగాను, ఇంకొకరు ఇంజనీరు గానూ, ఒకరు రాజకీయ రంగంలోనూ పనిచేస్తున్నారు. ఆమె అంత్యక్రియలు సోమవారం సంతనూతలపాడులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

మండల పరిధిలోని గుల్లపల్లి కోటి సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన వై శివరామకృష్ణ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా చెరుకుపల్లి వైపు నుంచి వస్తున్న పెద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చెరుకుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోళ్ల లారీ బోల్తా

**ప్రజాశక్తి-గిద్దలూరు**

పట్టణంలో కోళ్ల ఫామ్ లారీ అదుపుతప్పి బోల్తా పడ్డ సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. నరసరావుపేట నుంచి గిద్దలూరు చికెన్ షాప్‌లకు కోళ్లను సరఫరా చేసేందుకు వచ్చిన లారీ అతివేగం వలన పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీలో తరలిస్తున్న సుమారు రెండువేల కోళ్లు మృతి చెందాయి. ప్రమాదం జరిగిన సంఘటన స్థలంలో ఆ సమయంలో స్థానికంగా ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే అక్కడ ఉన్న ఒక స్కూటీ లారీ కింద పడి నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో సుమారు 5 లక్షల రూపాయల వరకు ఆర్థిక నష్టం జరిగినట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. అతివేగంతో లారీ నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

## రోటరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

రోటరీ ద్వారా అందిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు కొర్రపాటి ఖాజారావు, కుర్రా వెంకటరామయ్య అన్నారు. శనివారం యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో జంపని కోటేశ్వరరావు సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మార్టూరు ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్యనిపుణులు కొర్రపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 120 మంది రోగులను పరీక్షించి వారికీ ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ యూత్ చైర్మన్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు, జాష్టి కోటేశ్వరరావు, ఎన్విరాన్‌మెంటల్ చైర్మన్ చెన్నుపాటి బసవరాములు, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందిస్తున్న దృశ్యం

## 'ప్రజ్ఞ వికాసం' విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి-బాపట్ల**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈయేడాది ఫిబ్రవరిలో బాపట్ల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షలో విజేతలకు పాఠశాల స్థాయిలో మొదటి రెండు బహుమతులను విజేతలకు అందజేశామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య తెలిపారు. శనివారం బాపట్ల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్య మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు చదువుల కోసం పోరాడుతూనే అధ్యయనం పోరాటం నినాదంతో విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహిస్తూ వారిలోని సృజనాత్మకను వెలికి తీయడం కోసం ఇటువంటి మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 3 నుంచి జరగబోయే బోర్డు పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తద్వారా ఉన్నత అభ్యసించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల చదువులకు ఎటువంటి ఆటంకం కలగకుండా కృషి చేయడానికి ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లోనే ప్రశంశా పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 2కె రన్

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

గర్భిణులు, బాలింతలు, ఐరన్, క్యాల్షియం విటమిన్స్ గల ఆహార పదార్థాలను తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ డి సుధ తెలిపారు. శనివారం మండలంలోని పాతమాగులూరు ఎస్సీ టు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో టూ కె రన్ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు అయిన సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు, అరిగలు, సామలు, నూగులు, మినుములు, పెసలు మొదలైన వాటిలో ఏ పోషక పదార్థాలు ఉన్నాయో, ఎలా తీసుకోవాలో ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజకుమారి, ప్రధానోపాధ్యాయులు వెంకట కోటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

## కష్టపడి చదవండి.. పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

### కుమార్ పంప్స్ ఎండి సుబ్రహ్మణ్యం

**ప్రజాశక్తి-బాపట్ల**

పాలిటెక్నిక్ కష్టపడి జీవితంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి సమాజ అభివృద్ధి తోడ్పడాలని కుమార్ పంప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇష్టంతో చదివి చరిత్రలో గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారాన్ని అందించడానికి బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ ముందుంటుందన్నారు. పాలిటెక్నిక్ విద్యలో ఉత్తమ ప్రతిభా కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహన్‌రావు, గెల్లి దిలీప్ కుమార్, ప్రిన్సిపాల్ టి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కోశాధికారి టి రామకృష్ణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..

# భవనాల నిర్మాణం ఆలస్యం

**ప్రజాశక్తి-పంగులూరు**

"గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని మేము తీసుకొస్తాం, గ్రామాల్లో అభివృద్ధిని వేగవంతం చేస్తాం, అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన రోజు చెప్పారు. అయితే ఈ నాలుగేళ్ల కాలంలో ఆ అభివృద్ధి అనే మాట ప్రచార ఆర్భాటమే తప్ప, ఆచరణ మాత్రం లేదని ఇట్టే తెలిసిపోతోంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అది చేస్తాం, ఇది చేస్తామని మహా ప్రగల్బాలు పలికిన నాయకులు ఆచరణలో పూర్తిగా విఫలమయ్యారనటానికి ఇదే నిదర్శనం. పంగులూరు మండలంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 12 కోట్ల, 36 లక్షల రూపాయల వ్యయంతో, 39 భవనాలు, 28 సిమెంట్ రోడ్లు మంజూరు కాగా, ఈ నాలుగేళ్ల కాలంలో కేవలం 14 భవనాలు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభమయ్యాయి. 28 సిమెంట్ రోడ్లకు గాను, 18 సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం విషయంలో, ప్రభుత్వం బిల్లులు సకాలంలో అందించక పోవడమే నిర్మాణాలు వెనకపడటానికి కారణమని పలువురు అంటున్నారు. మండలంలో 14 సచివాలయాలు, 14 రైతు భరోసా కేంద్రాలు, 11 వెల్‌నెస్ సెంటర్లు ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో మంజూరు చేసింది. ఇందులో 8 సచివాలయాలను కొత్తగా నిర్మించగా, ఆరు సచివాలయాలు ఈపాటికే ఉన్న పంచాయతీ కార్యాలయాలపై నిర్మించారు. అందువలన కొత్తగా నిర్మించిన వాటికి ఒక్కోదానికి రూ.80 లక్షల చొప్పున మంజూరు కాగా, పంచాయతీ

పంగులూరులో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

కార్యాలయాలపై నిర్మించిన సచివాలయాలకు ఒక్కోదానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ 14 సచివాలయాల నిర్మాణానికి నాలుగు కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. అయితే బిల్లులు సక్రమంగా సకాలంలో ప్రభుత్వం నుంచి రాకపోవడం వలన, 9 సచివాలయాలు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. కేవలం ఐదు సచివాలయాలు మాత్రమే ఇప్పటికి ప్రారంభమయ్యాయి. 14 రైతు భరోసా కేంద్రాలకు గాను, ఒక్కో దానికి రూ.21.8 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తానికి రెండు కోట్ల 94 లక్షల రూపాయలు మంజూరు కావలసి ఉండగా, అందులో బిల్లుల ఆలస్యం కారణంగా, ఆరు రైతు భరోసా కేంద్రాలు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభమయ్యాయి. ఇంకా ఎనిమిది రైతు భరోసా కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఒక్కో వెల్నెస్ సెంటర్‌కు 17.5 లక్షల రూపాయల చొప్పున 11 వెల్నెస్ సెంటర్‌లు మండలానికి మంజూరయ్యాయి. వీటిలో కేవలం మూడు సెంటర్లు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభం అయ్యాయి. మిగతా 8 ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలో సుమారు కోటిన్నర రూపాయలకు పైగా బిల్లులు కావలసి ఉండగా, భవనాల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగక వివిధ దశలలో ఉన్నాయి. దీనివలన భవనాలు ప్రారంభం కాలేదు. భవనాలు ప్రారంభం కానందువలన అనేక గ్రామాల్లో ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నాలుగేళ్లలో మండలంలో 28 సిమెంట్ రోడ్లు మంజూరు కాగా, 18 సిమెంట్ రోడ్లు మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఒక్కో సిమెంట్ రోడ్డు 10 లక్షలు చొప్పున, కోటి 80 లక్షల రూపాయలు బిల్లులు కావాల్సి ఉండగా, అందులో 75శాతం డబ్బులు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా 25 శాతం డబ్బులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మిగతా పది సిమెంట్ రోడ్లు నిర్మాణం ఏమాత్రం నోచుకోలేదు. ఏది ఏమైనా చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్లనే నిర్మాణాలు ప్రారంభించిన నాలుగేళ్లయిన ఇంతవరకు పూర్తి కాలేదు. కేవలం ప్రభుత్వ ఉదాశీన వైఖరి కారణంగానే అడుగు ముందుకు పడటం లేదని అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు విడుదల చేసి పనులు వెంటనే జరిగే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

# బాపనయ్య స్ఫూర్తితో ఉద్యమాలు

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

**ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్**

నాలుగు దశాబ్దాల పాటు సమాజంలో అణగారిన వర్గాల కోసం, అట్టడుగునున్న కష్టజీవుల కోసం ఉద్యమాలు చేసిన నిస్వార్థ ప్రజా నాయకుడు గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో బాపనయ్య 45వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులకు పదవులు అలంకారం అయితే, బాపనయ్య లాంటి ప్రజా నాయకులు ఆ పదవులకే అలంకారంగా ఉంటారని తెలిపారు. పదవులు ప్రజల కోసమేనని, తమ జీవితాలు ఉద్యమాలకే అంకితమని, నిస్వార్థంగా శ్రమించిన బాపనయ్య జీవితం నేటితరానికి ఆదర్శం కావాలని ఆయన అన్నారు. చల్లపల్లి జమిందార్లకు వ్యతిరేకంగా సాగిన భూ పోరాటంలో బాపనయ్య అగ్రభాగాన నిలిచాడని, 17 వేల ఎకరాల భూములను పేదలకు పంచేవరకు విశ్రమించలేదని తెలిపారు. అటువంటి పోరాటాలే ప్రజలకు అనేక చట్టాలు, సంక్షేమ పథకాలుగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే ఆ చట్టాలు, హక్కులను పరిరక్షించుకునే విధంగా ఉద్యమాలు సాగిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాపనయ్య లాంటి అమరజీవులు త్యాగాలతో చట్టాలు సాధిస్తే, నేటి పాలకులు పదవులను అడ్డంగా పెట్టుకుని అక్రమ సంపాదనకు దారులు వేసుకుంటున్నారని పేర్కొన్నారు. పేదలకున్న హక్కులను, చట్టాలను హరించే విధంగా కేంద్ర రాష్ట్ర పాలకులు వ్యవహరిస్తున్నారని, సంక్షేమ పథకాలు కుదించి సంపన్నులకు అనుకూల విధానాలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలను ప్రతిఘటించేందుకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రజలు ఈ ఉద్యమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈదర సుబ్బారావు, అడ్డగబొట్టు నరసయ్య, ఇస్తర్ల రాములు, కే సింగయ్య, ఐ నరసింహారావు, కే అంజయ్య, దారా సుబ్బారావు, కూకట్ల రాములు, ఎల్ నాగేశ్వరరావు, గుంజి అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు బాపనయ్యకు నివాళి అర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

# 5న ఢిల్లీలో పోరాట ప్రదర్శన: సిఐటియు

**ప్రజాశక్తి-బాపట్ల**

కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5 డిల్లీలో కార్మిక-కర్షకుల పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు బాపట్ల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలో మోడీ నాయకత్వాన ఉన్న ప్రభుత్వ విధానాల కారణంగా కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలు పెద్ద ఎత్తున పెరిగాయి. దేశంలో మోడి ప్రభుత్వం అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతోందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిని సైతం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతోంది. పేదలు, కార్మికులు ఉపాధి అవకాశాలు, ఆదాయాలు తగ్గుతూ కార్పొరేట్ వ్యాపారవేత్తల ఆదాయాలు ఘనంగా పెరుగుతున్నాయి. కార్మికులను కట్టు బానిసలుగా చేసే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి కార్మికులు సమ్మె చేయకుండా, యూనియన్ల ఏర్పాట్లలో ఆంక్షలు పెడుతోందని విమర్శించారు. కనీస వేతనాలు, పనిగంటలు, పిఎఫ్, ఈఎస్ఐ ఇతర కార్మిక హక్కులపై దాడి చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, టైం స్కేల్, రోజువారి కూలి, గౌరవ వేతన కార్మికులును పర్మినెంట్ చేసి, అందరికీ సామాజిక భద్రత కల్పించడంతోపాటు సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరించాలన్నారు. విద్య, వైద్య విధానం, అధిక ధరలు తగ్గించాలని, ఆహార పదార్థాలు, నిత్యావసరాలుపై జిఎస్టి ఉపసంహరించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాసులపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతాంగం హక్కులను రక్షించాలని ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక-కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, జి సుధాకర్, పి రేఖఎలిజబెత్, కె లక్ష్మి, జి ప్రతాప్, సిహెచ్‌వి రంజని, సామియేలు, బి తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

అకాలవర్షంతో దెబ్బతిన్న

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

**ప్రజాశక్తి-అద్దంకి**

అకాల వర్షంతో నష్ట పోయిన రైతన్నలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని శాసనసభ్యులు గొట్టిపాటి రవి కుమార్ డిమాండ్ చేశారు. గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షాలు సంత మాగులూరు, బల్లికురవ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వడగల్లు వానతో అన్నదాతలు కుదేలాయ్యరన్నారు. చేతి కొచ్చే పంటలు పంట పొలాల్లోనే నీల మట్టం అయ్యాయి. భారీవర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లి, దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా పంట నష్టంపై సర్వే నిర్వహించాలన్నారు. రైతాంగం పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని క్షేత్రస్థాయిలో పూర్తిగా పంట గణన చేపట్ట కుండా అంకెలగారడీలాగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యంగా మిర్చి, పొగాకు,బొప్పాయి, మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులు ఎక్కువమంది కౌలు రైతులే ఉన్నారని తక్షణమే అధికారులు పంట నష్ట వివరాలు సేకరించి రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. లేనిపక్షంలో ఉమ్మడి ప్రకాశంజిల్లా వ్యాప్తంగా రైతాంగాన్ని సమీకరించి వారికి న్యాయం జరిగే వరకూ పోరాడటానికి వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వైసిపిలో వైద్యుల పాత్ర కీలకం

అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో డాక్టర్ల పాత్ర చాలా కీలకమైందని, రాష్ట్రంలో ఉన్న అందరు వైసీపీ అభ్యర్థులు గెలుపు కోసం పనిచేయాలని వైసిపి అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నాడు తాడేపల్లిలో సమావేశం నిర్వహించారు. బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2024లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు వైసిపి వైద్య విభాగం తరపున సిద్ధంగా ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, నవరత్నాల కోఆర్డినేటర్ నారాయణమూర్తి పాల్గొన్నారు. అనంతరం బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

## పాడి రైతులకు అండగా ప్రభుత్వం: జేడీప

టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీప బేబీరాణి

**ప్రజాశక్తి-టంగుటూరు**

పశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని కోట్లయినా వెచ్చిస్తూ పాడి రైతులకు అండగా నిలుస్తుందని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె బేబీరాణి పేర్కొన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శనివారం స్థానిక అరుంధతి నగర్ సమీపంలోని రావి వెంకటేశ్వర్లు డెయిరీ ఫామ్ వద్ద గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటయోధుడు బాపనయ్య

## - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు - ఘన నివాళులర్పించిన నాయకులు

చీమకుర్తిలో బాపనయ్యకు నివాళులర్పిస్తున్న కంకణాల

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జమీందారీ విధానం రద్దు కావాలని, దున్నేవానికి భూమి దక్కాలని, అంటరానితనం, అమానుషాలు అంతం కావాలని గుంటూరు బాపనయ్య శ్రమించారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య పేర్కొన్నారు. అమరజీవి గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు గుంటూరు బాపనయ్య స్ఫూర్తితోనే ప్రజాఉద్యమాల్లోకి వచ్చామని తెలిపారు. మూడు సార్లు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బాపనయ్య నిస్వార్థ ప్రజా నాయకుడిని వారు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ చల్లపల్లి రాజా దురాగతాలపై జరిగిన పోరాటం, గాజులంకలో వీరనారి వీయమ్మ సాహసం, చల్లపల్లి నారాయణరావు అమరత్వం, 42 మంది అమరవీరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న చట్టాలను పరిరక్షించుకునేందుకు బాపనయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, జి. శ్రీనివాసులు, పి. కల్పన, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి, జె వి వి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ పాల్గొన్నారు.

**చీమకుర్తి:** జమీందారీ వ్యతిరేక పోరాటయోధుడు, వ్యవసాయ కార్మికోద్యమనేత, మాజీ ఎమ్మెల్యే గుంటూరు బాపనయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని.. ఆయన చూపిన బాటలో పయనిద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నిప్పట్లపాడులో బాపనయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, మండల కార్యకర్తలు నుగ్గ శ్రీను, కాశిం, సుల్తాన్, సీతమ్మ, రమణమ్మ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

**కొండపి:** గుంటూరు బాపనయ్య వర్ధంతి శనివారం నాడు మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెజి మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.వందనం, సురేష్, సిహెచ్ అంకయ్య, జి.వెంకటేశ్వర్లు, పి.యేసు విష్ణు, ఎస్తేరమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

**కనిగిరి:** బాపనయ్య వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సుందరయ్య భవనంలో ఏపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపనయ్య చిత్రపటానికి ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కత్తి ఏబు, వెలుగొండయ్య, గురునాథం, రాములు, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**హనుమంతునిపాడు:** కామ్రేడ్ గుంటూరు బాపనయ్య వర్ధంతి కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు బాపనయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కత్తి ఏబు, వెలుగొండయ్య, గురునాథం, రాములు, నాగులూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కార్లు పంపిణీ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్:** నిరుద్యోగ యువతకు 'జగనన్న బడుగు వికాసం' పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి యువతకు ఈ పథకంలో 45 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మంజూరు చేసిన మూడు కార్లు, రెండు మినీ ట్రక్కులను లబ్ధిదారులకు శనివారం ఆయన కలెక్టరేట్‌లో అందించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మేయర్ సుజాత పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

**ప్రజాశక్తి-చీమకుర్తి**

పదోతరగతి విద్యార్థులకు చీమకుర్తి రోటరీక్లబ్, అభయ కళారాధన సంస్థల ఆధ్వర్యంలో వేర్వేరు పాఠశాలల్లో పరీక్షా సామాగ్రి అందజేశారు. శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బండ్లమూడి, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ నాయకులు గొల్లపూడి చౌదరి, తిరుపతిరెడ్డి, పి.శ్రీనివాసమూర్తి, వీరారెడ్డి, చలమయ్య పాల్గొన్నారు. అభయకళారాధన సంస్థ ఆధ్యక్షులు మద్దాళిమాధవరావు ఆధ్వర్యంలో స్థానిక క్రిష్టియన్‌పాలెంలో జెవైసి యూత్ స్టడీ ప్రాంగణంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు ఆనంద్, శామ్యూల్, కార్తీక్, సాత్విక్, ప్రేమ్‌కుమార్, వాసు, సిద్దార్థ పాల్గొన్నారు.

చీమకుర్తిలో పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

**దొనకొండ:** స్థానిక ఆర్‌సీయం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల విద్యాధికారి ఎన్.సాంబశివరావు పరీక్షా సామాగ్రిని శనివారం పంపిణీ చేశారు. ప్రభు చారిట్రబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు తమ సొంత నిధులతో 25 మంది విద్యార్థులకు పరీక్ష రాసే అట్టలు, పెన్నులు సమకూర్చారు. కార్యక్రమంలో సిస్టర్ విజయరాణి, వరికూటి వెంకటేశ్వర్లు, కొండా నాగరాజు, కె.ఐజక్, సీఆర్‌పీ చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ రక్షణకు ఉద్యమించాలి

## - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు
## - ఒంగోలులో ఎస్‌డబ్ల్యుఎఫ్ వర్క్ షాప్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ప్రభుత్వ రంగ రక్షణకు కార్మికులు ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 రెండు రోజుల వర్క్ షాప్ ఒంగోలులో శనివారం ప్రారంభమైంది. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జిలాని భాష రెండు రోజుల వర్క్ షాప్‌నకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రకాశం జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ జెండాను ప్రకాశం జిల్లా అధ్యక్షుల బి వి రావు ఆవిష్కరించారు. వర్క్ షాప్‌ను ప్రారంభించిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ఆర్టీసి రక్షణకు కార్మికులు ఉద్యమించాలని, ప్రభుత్వ రంగ సంస్థ రక్షణకు భారత కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎల్‌పిజి విధానాలు ఆర్టీసీని నిర్వీర్యం, కుదించి వేస్తున్నాయన్నారు. ఆర్టీసీలో ఐక్య ఉద్యమాల ద్వారానే సంస్థను రక్షించగలమన్నారు. ఉద్యమ నిర్మాణం చేసుకునేందుకు ఈ వర్క్ షాప్ ద్వారా కార్యకర్తలను తయారు చేసుకోవాలని కోరారు. ఈ వర్క్ షాప్ జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ దేశంలో రవాణా రంగం సంక్షోభంలో ఉందని, ఆర్టీసి తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఎంవి యాక్ట్ అమలు చేయటం ద్వారా ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. తద్వారా తీవ్రమైన పెనాల్టీలు వేస్తూ వాహనదారులు ,డ్రైవర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. అందులో భాగంగానే ఈనెల 13 నుంచి 20 వరకు ఆర్టీసీ రక్షణ ప్రచార వారోత్సవం దేశవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు మార్చుకొని ప్రభుత్వ రవాణాని కాపాడాలని కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీలకు 1:2 నిష్పత్తిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు .ప్రతి సంవత్సరం ఆర్టీసీకి కొత్త బస్సులు కొనాలని, విద్యుత్ బస్సులను నేరుగా ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులకు రావలసిన అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్క్ షాప్ లో 25 జిల్లాల నుంచి ప్రతిదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్ప రెడ్డి సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏ ఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసులు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసరావు, నాయకత్వం వహించారు.

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

# డిజెఆర్ ట్రస్టు ద్వారా పేదలకు సాయం

## మాజీ ఎమ్మెల్యే దామచర్ల

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

డిజెఆర్ ట్రస్టు ద్వారా ఒంగోలు నగరంలో పేదలకు మరింత సహాయం చేస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక బికె ఎన్‌క్లేవ్‌లోని దామచర్ల జనార్ధనరావు నివాసంలో శనివారం దామచర్ల తల్లి దామచర్ల రత్తమ్మ, సతీమణి నాగ సత్యలత 10 మంది పేద ప్రజలకు సుమారుగా 1.50లక్షల విలువైన తోపుడు బండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, పి. వెంకటేశ్వరెడ్డి, టిడిపి కార్పొరేటర్లు దాచర్ల రమణయ్య, టి. రవితేజ, అంబూరి శ్రీను, ట్రస్ట్ సభ్యులు నిడమానూరి పావని, షేక్ ఆరిఫా, పెద్దిశెట్టి వరలక్ష్మి, బెజవాడ మురళి, కుర్రా అయ్యప్ప, మలినేని కోటేశ్వరరావు, కోటపూరి చిరంజీవి పాల్గొన్నారు.

తోపుడు బండి పంపిణీ చేస్తున్న దామచర్ల

## నవభారత నిర్మాణం కోసం కదలాలి

**ప్రజాశక్తి-కనిగిరి**

మాట్లాడుతున్న పివి.శేషయ్య

నవభారత నిర్మాణం కోసం యువత ముందుకు కదలాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు పివి. శేషయ్య పేర్కొన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని కనిగిరి పట్టణంలోని ఎంఎన్ఎం డిగ్రీ కళాశాల, ప్రగతి విద్యానిలయంలో విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు పివి శేషయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

యువత విప్లవ కిషోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి దేవరాజ్, డివైఎఫ్ఐ నాయకులు విజయ్, ప్రిన్సిపాల్ డి రాజశేఖరరెడ్డి, తిలక్, ఐటిఐ ప్రిన్సిపాల్ జి.తిమోతి, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగూర్ మీరా, వాసు, రామాంజనేయులు, ఏసురాజు పాల్గొన్నారు.

## యోగా క్లాసులను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-కనిగిరి**

పట్టణంలోని గార్లపేటరోడ్డులోగల శ్రీసాయిబాబా కళ్యాణ మండపంలో ఈ నెల 26న ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు యోగా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ ఎస్.పిచ్చిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 27 నుండి 10 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు వీరస్వామి గురూజీ యోగా శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. కనిగిరి ప్రాంత ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఆయన సూచించారు.

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

**ప్రజాశక్తి-పొదిలి**

వాహన చోధకులు మద్యం సేవించి వాహానాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. శనివారం స్దానిక పెద్దబస్టాండ్ సెంటర్‌లో సాధారణ వాహనాల తనిఖీలో భాగంగా ద్విచక్ర వాహనాలను తన సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని పెనాల్టి విధించి కేసు నమోదు చేశారు. పలు వాహనాలకు సరైన పత్రాలు లేని 20 మంది వాహన చోదకులను గుర్తించి వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్రాంతి గదుల ఏర్పాటు అభినందనీయం

### ఎమ్మెల్యే మద్దిశెట్టి

**ప్రజాశక్తి-దరిశి**

తాళ్ళూరు మండలం, తూర్పుగంగవరం సమీపంలో ఉన్న శ్రీ గుంటిగంగ భవానీ అమ్మవారి ఆలయం దగ్గర దాకల సహకారంతో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడం అభినందనీయనీయమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. శ్రీ గుంటిగంగమ్మ గుడి చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు దాతల సహకారంతో ఆరు విశ్రాంతి గదులను సుమారు 30 లక్షల రూపాయలతో నిర్మాణం చేశారు. శనివారం ఆ గదులను ఎమ్మెల్యే మద్దిశెట్టి ప్రారంభించారు. ముందుగా వచ్చే నెల ఆరు నుండి జరిగే అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ముందుగా గుడిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. మద్దిపాడు మాజీ ఎఎంసి చైర్మన్ మారం వెంకటరెడ్డి విశ్రాంతి గదులలో ఒక గదిని స్వంత నిధులలో నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఇన్‌ఛార్జి మద్దిశెట్టి రవీంద్ర, మారం వెంకటరెడ్డిలను ఘనంగా సన్మానించారు. తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ఎమ్మెల్యే మద్దిశెట్టి

విశ్రాంతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

వేణుగోపాల్ ప్రారంబించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, కృష్ణస్వామి, మాజీ ఎఎంసి చైర్మన్ ఇడమకంటి వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, ఎఒ ప్రసాద్, డాక్టరు రత్నం, నాయకులు యాడగ శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, కాశిరెడ్డి, కాలేషావలి, కరిముల్లా, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్**

వినతిపత్రం అందజేస్తున్న రేషన్ పంపిణీ వాహనదారులు

మండలంలోని రేషన్ పంపిణీ వాహనదారులు తమ సమస్యలు పరిష్కరించాలని, బీమా సదుపాయం కల్పించాలని డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎండియు వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ అమౌంట్ ప్రభుత్వానికి చెల్లిస్తామని చెప్పినప్పటికీ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి ఎండియు ఆపరేటర్‌కి సుమారు రూ. 18 వేల నుండి రూ. 23 వేల వరకు పెనాల్టీ విధించడం జరిగిందన్నారు. జీతం పడిన వెంటనే ఆ అమౌంట్ కట్ చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే తమకు జీతాలు ఇప్పించాలన్నారు. గుండెపోటు, అనారోగ్యంతో సుమారు 57 మంది వరకు చనిపోయారని, వారికి తక్షణమే ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించాలని, తద్వారా బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అందరికీ బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

## కూరగాయల మార్కెట్‌లో వేలం పాట

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దివిఎస్ నారాయణరావు ఆధ్వర్యంలో దినసరి కూరగాయల మార్కెట్, చేపలు, మాసం మార్కెట్ వేలంపాటలను నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్ వేలంపాటలో నలుగురు పాల్గొనగా రూ.6 లక్షలా 78వేలకు ఎస్‌కె నాయబ్‌రసూల్ పాటను దక్కించుకోవటం జరిగింది. చేపలు మాంసం మార్కెట్ వేలంపాటకు సంబంధించి రూ.1.10 లక్షలకు మన్సూర్ పాటను దక్కించుకోవటం జరిగింది. గతేడాది కంటే దినసరి కూరగాయల మార్కెట్ వేలంలో నగర పంచాయతీకి రూ.67 వేలు, చేపలు, మాంసం మార్కెట్ వేలంలో రూ.40 వేల ఆదాయం ఎక్కువ వచ్చింది. నిబంధనల మేరకు వేలం పాటలను నిర్వహించినట్లు కమిషనర్ డివిఎస్ నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలో ఢిల్లీని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-కొండపి**

ఏప్రిల్ ఐదున చలో డిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెజి.మస్తాన్ కోరారు. శనివారం నాడు కొండపి మండలం, పెరిదేపిలో చలో డిల్లీ కార్యక్రమం కర్రపత్రాలను పచ్చాకు కూలీలతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగలకుర్తి బ్రహ్మయ్య, పచ్చాకు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని షేక్ సుల్తాన్‌బాషా కుమార్తె షేక్ అంజు పర్వీన్ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరనాయక్, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## పొగాకు కనిష్ట ధర రూ.188

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి వేలం కేంద్రంలో శనివారం నాడు పొగాకు కనిష్ఠ ధర కిలో రూ.188 పలికిందని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 912 పొగాకు బేళ్లు అమ్మకానికి ఉంచారు. అందులో 796 బేళ్లు 9 కంపెనీల ఆద్వర్యంలో కొనుగోలు చేయగా మిగిలిన 116 బేళ్లు వివిద కారణాలతో ఇంటికి తిరుగుముఖం పట్టాయి. గరిష్ఠ ధర కిలో రూ.200, కనిష్ఠ ధర కిలో రూ.188, సరాసరి ధర కిలో రూ.197.13 పలికిందన్నారు.

## రైతు విభాగం రాష్ట్ర నాయకులకు సత్కారం

**ప్రజాశక్తి-కనిగిరి**

వైసీపీ రైతు విభాగం రాష్ట్ర సమావేశంలో జిల్లా అధ్యక్షులు సూరసాని మోహన్‌రెడ్డి పాల్గొని.. వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతు విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 27న న్యూషాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు వేలం

**ప్రజాశక్తి-టంగుటూరు**

ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు మండలంలోని శ్రీ వల్లూరమ్మ దేవస్థానం ఆవరణలో న్యూ షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి బద్దెపురి రమేష్ తెలిపారు. కొత్త షాపింగ్ కాంప్లెక్స్ లోని 7, 9 వ నెంబర్ షాపులకు విడి విడిగా వేలం నిర్వహిస్తామన్నారు. రానున్న ఏప్రిల్ 1వ తేదీ నుండి 31-03-2026 వరకు 3 సంవత్సరాల కాలపరిమితితో దుకాణాలు నిర్వహించుకొను హక్కుగా వేలం నిర్వహిస్తారు. రూ 10వేల ధరావత్తు చెల్లించి షాపులో పాల్గొన్న హెచ్చు పాటదారుకు దుకాణాలను అప్పగిస్తామని, ఆసక్తిగల భక్తులు ఈ వేలం పాటలకు హాజరుకావాలని ఈఓ రమేష్ సూచించారు.

## పనిచేయని వాలంటీర్లు రాజీనామా చేయాలి

### ఎంపిపి సావిత్రి

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

పని చేయలేని వాలంటీర్లు ఉంటే.. తక్షణమే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో తామే తొలగించి కొత్తవారికి అవకాశం కల్పిస్తామని హనుమంతునిపాడు మండల అధ్యక్షురాలు గాయం సావిత్రి అన్నారు. శనివారం మండల అభివద్ధి అధికారి కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని సచివాలయాల సెక్రటరీలు మరియు వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయం సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వమందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించాలనే సంకల్పంతో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటారనే సంకల్పంతో వాలంటరీలను నియమించారని కానీ అందుకు విరుద్ధంగా వాలంటరీలు నెల అయ్యేసరికి జీతం కోసం ఎదురుచూస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల అభివద్ధి అధికారి జీవీ కష్ణారావు, సర్పంచి కత్తి రాజారావు, ఆదినారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణస్వామి పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై దృష్టి సారిస్తా..: ఎస్ఐ

**ప్రజాశక్తి-కొండపి**

మండలంలోని అన్ని గ్రామాలలో శాంతిభద్రతలపై దృష్టి సారిస్తానని కొండపి ఎస్ఐ వైవి.రమణయ్య తెలిపారు. శనివారం నాడు సాయంత్రం కొండపి ఎస్ఐగా వైవి.రమణయ్య నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సిఐ మాతంగి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన 'దద్దాల'

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

ఒంగోలు పట్టణంలోని జడ్పీ క్యాంప్ కార్యాలయంలో హనుమంతునిపాడు మండల జడ్‌పిటిసి డాక్టర్ దద్దాల నారాయణ శనివారం జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి దద్దాల నారాయణ మాట్లాడుతూ హనుమంతునిపాడు మండలంలో పలు అభివద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

## వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

మండలంలోని వర్ధినేనివారిపాలెం పంచాయతీ పరిధిలోని యన్.యన్. ఖండ్రిక క్లస్టరులో సి15లో బీసీ మహిళ 1, తూమాడు సి7లో 1, యస్‌సీ మహిళ 1, రామచంద్రాపురం సి10లో ఓసీ జనరల్ 1.. ఈ గ్రామాలలో వాలంటీర్ల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడి రామకృష్ణ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 27వ తేదీ నుంచి తీసుకుంటామన్నారు. పదో తరగతి లేదా తత్సమానమైన విద్యార్హత కలిగి వుండాలన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాశక్తి-దరిశి**

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు నారపశెట్టి మధు, కార్యదర్శి సత్యం 15 మంది అనాథ పిల్లలకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ పి.పెద్దిరాజు మాట్లాడుతూ అనాథ పిల్లలను అందరూ ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

పశుపోషకులు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జరుగుమల్లి పశువైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఎం.అరుణ అన్నారు. గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని జరుగుమల్లిలో శనివారం డాక్టర్ అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు గాలికుంటు వ్యాధి సోకిన రైతులకు కలిగే నష్టాన్ని డాక్టర్ అరుణ రైతులకు వివరించారు.

## బాలింతలకు పోషకాహారం అవసరం

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

గర్భవతులు, బాలింతలు పోషకాహారాలైన పిండి పదార్థాలు, కందిపప్పు, వేరుశనగపప్పు, కోడిగుడ్లు తీసుకోవాలని జరుగుమల్లి సెక్టారు సూపర్‌వైజర్ రమ తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసే కిట్స్ గురించి శనివారం వివరించారు. సాధువారిపాలెం గ్రామంలో గర్భవతులు, బాలింతలతో ర్యాలీ నిర్వహించారు.

**పిసిపల్లి:** మండలంలోని మెట్లవారిపాలెం అంగన్‌వాడి కేంద్రంలో పోషకాహారంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదఇర్లపాడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, ఎఎన్ఎం విజయకుమారి, అంగన్ వర్కర్లు మహాలక్ష్మి, సఫల, జ్యోతి పాల్గొన్నారు.

# డబ్బులిస్తాం.. ఇళ్లు పూర్తి చేయండి

**- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ జేఎండి శివప్రసాద్**

**ప్రజాశక్తి-పంగులూరు**

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టి, మధ్యలో ఆగిపోయిన వారు వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇప్పటివరకు నిర్మాణాలు మొదలుపెట్టని వారు, వెంటనే మొదలు పెట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ జేఎండి శివప్రసాద్ అన్నారు. నిర్మాణాలు పూర్తయిపోతే డబ్బులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, డబ్బులకు ఇబ్బంది లేదని ఆయన అన్నారు. శనివారం ఉదయం మండలంలోని ముప్పవరం గ్రామంలో నిర్మించిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం చాలా చక్కగా జరిగిందని, లబ్ధిదారులు ఇళ్లను బాగా నిర్మించుకున్నారని ఆయన ప్రశంసించారు. నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వారు వెంటనే ప్రారంభించాలని, ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించి, వేగంగా వెళ్లి నిరూపించుకోవాలని అన్నారు. ఇప్పుడు ఇల్లు నిర్మించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు పడతారని, ఎన్నికల నాటికి ఇళ్ల పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందని, అందువలన వెంటనే నిర్మాణాలు చేపట్టాలని శివప్రసాద్ కోరారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా డిఆర్డిఏ వారు డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు కూడా ఇప్పిస్తున్నారని చెప్పారు. అధికారులు కూడా లబ్ధిదారులను ప్రోత్సహించి, వారి ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. రాష్ట్రంలో జగనన్న కాలనీలు సుందరంగా తయారవుతున్నాయని, లబ్ధిదారులు కూడా ఉత్సాహంగా ఇల్లు నిర్మించుకున్నారని ఆయన చెప్పారు. ప్రతి పేదవాడికి ఇంటి వసతి కలిగించాలని ప్రభుత్వం భావించిందని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలు ఇల్లు నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాదు, ఎంపీడీవో రమణమూర్తి, డిఈ శర్మ, ఏఈ కిషోర్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ రామ్‌కుమార్, ఏపీఎం జ్యోతి ప్రసాద్, ముప్పవరం గ్రామ సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ గంగాధర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటిస్తున్న గృహ నిర్మాణ శాఖ జెఎండి శివప్రసాద్

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు 31వ విడత కార్యక్రమాన్ని శనివారం ఎంపిపి, డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షతన గోపాలమిత్ర కేంద్రంలో గోవులను, గేదెలకు టీకాలు వేశారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు టీకాలు కార్యక్రమం జరుగుతుందని పుట్టిన 4 నెలల దూడ నుంచి అన్ని రకాల పశువులకు టీకాలు వేయించుకోవచ్చునని తెలిపారు. ఆలాగే ఓలేరు గ్రామంలో సర్పంచ్ మెరుగు రంగారావు శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, వైద్యులు బి లక్ష్మీ రంజిత, గోపాల మిత్ర తిరుమలరావు, రైతులు పాల్గొన్నారు.

**కర్లపాలెం:** పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కర్లపాలెం మండల పశు వైద్య అధికారి ఎం రేచల్ దివ్య తెలిపారు. శనివారం కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో సుమారు 300 పశువులకు (4 నెలలు పైబడిన దూడలు, ఆవులు, గేదెలు) పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ అవకాశం మండలంలోని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుద్దాం లైవ్ స్టాక్ అసిస్టెంట్ బి రాజేష్, షేక్ రహంతున్నిసా, బి నవీన్ కుమార్, గోపాల మిత్రలు కె శ్రీనివాసాచార్యులు, ఏ బాలశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిఎల్‌పురానికి సాగర్ నీరు పునరుద్ధరించాలి: సిపిఎం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండలంలోని గుండువాని లక్ష్మీపురంకు మంచినీరు సరఫరా పునరుద్ధరించాలని సిపిఎం గ్రామశాఖ డిమాండ్ చేసింది. శనివారం జిఎల్‌పురంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో రామతీర్థం జలాశయం నుంచి పైపులైన్ ద్వారా గ్రామానికి మంచినీరు అందేదన్నారు. గత మూడు నెలలుగా పైపులైన్ ద్వారా నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. కొందరు ప్లాంట్ నీరు కొనుగోలు చేసి తాగుతున్నారన్నారు. వాటి వలన తీవ్రమైన కీళ్ళ నొప్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలక, అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని రామతీర్థం జలాశయం నుంచి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, గ్రామశాఖ కార్యదర్శి నిడమానూరి వెంకటేశ్వర్లు, సిపిఎం వార్డు కమిటీ సభ్యులు నల్లూరి కోటయ్య, గ్రామశాఖ సభ్యులు నల్లూరి కోటేశ్వరరావు, ఇనకల్లు బసవయ్య, కొమ్ము ప్రభుదాసు, పేర్నేడి కోటయ్య పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

**ఎంపిపి సూరా భూలక్ష్మీరామసుబ్బారెడ్డి**

**ప్రజాశక్తి-తర్లుపాడు**

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ నరసింహులు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి సూరా భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని, సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించామన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు వారి దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తెచ్చినట్లయితే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపిడిఓ ఎస్ నరసింహులు మాట్లాడుతూ సిఎం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ.14,52,48,500 అందించినట్లు తెలిపారు. వెలుగు ఎపిఎం పిచ్చయ్య మాట్లాడుతూ ఆసరా పథకం కింద లబ్ధిదారులకు నగదు జమ అవుతుందన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి బ్యాంకుల ద్వారా రూ.35 వేల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

## 'గడపగడపకూ'లో బూచేపల్లి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండలంలోని బక్కిరెడ్డిపాలెంలో శనివారం సాయంత్రం జరిగిన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అర్హులందరికీ అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమలంలో మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు గంగిరెడ్డి ఓబులరెడ్డి, పులి వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న బూచేపల్లి

## రైతుభరోసా కేంద్రం సందర్శన

**ప్రజాశక్తి-పెద్దారవీడు**

మండల వ్యవసాయ అధికారి టూర్ డైరీలో భాగంగా మండలంలోని కంభంపాడు రైతు భరోసా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కంభంపాడు గ్రామంలోని ప్రత్తి రైతులతో మాట్లాడి పంట పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్తి పంటలో పచ్చదోమ, తెల్లదోమ, జాసిడ్స్‌ను గమనించారు. వీటి నివారణకు పొలంలో ఎకరాకు 20 చొప్పున నీలిరంగు జిగురట్టలు, పసుపు రంగు జిగురట్టలను పెట్టాలని సూచించారు. దీని ద్వారా కొంతవరకు దోమ ఉనికి తగ్గుతుందని అన్నారు. ఆఖరి ప్రయత్నంగా మాత్రమే పురుగు మందులను స్ప్రే చేయాలని, దోమ నివారణకు ఎసీటామి ప్రైడ్ స్ప్రే చేయొచ్చునని రైతులకు వివరించారు. అదేవిధంగా పంట పొలం చుట్టూ రక్షణ పంట మరియు పంట మధ్యలో పొగాకు లద్దె పురుగు ఉనికి తెలుసుకోవడానికి ఆముదం మొక్కలను అక్కడక్కడా వేసి తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి, గ్రామ ఉద్యాన సహాయకుడు వస్త్రం నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

ఇంకొల్లు మండలం పూసపాడు ఎస్‌కెఎవిఎస్ హైస్కూలు పదో తరగతి విద్యార్థులకు పర్చూరు రోటరీక్లబ్ వారు కిట్లు పంపిణీ చేశారు. నర్రా వెంకట్, సుధారాణి దాతల సహకారం కిట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు వివరించారు. విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె సుబ్బారావు, ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పి నాగేశ్వరరావు, సాయి, వేణు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**పర్చూరు:** రోటరీ క్లబ్ పర్చూరు ఆధ్వర్యంలో మండలంలోని నాగులపాలెం గురుకుల పాఠశాల, బధిరుల పాఠశాల, వైఆర్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ప్యాడ్లు, కిట్లు అందజేశారు. నర్రా వెంకట్ లక్ష్మీసుధ ఆర్థిక సాయంతో అందజేసినట్లు రోటరీ అధ్యక్షులు నాగుబడి శ్రీనివాసరావు వివరించారు. మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు తోకల కృష్ణమోహన్, పాబోలు వెంకన్న, చంద్రం, కొల్లా నరేంద్ర కుమార్, సుబ్బారావు, అశోక్, రమేష్‌చంద్ర, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలకు జరిగిన జరిగిన పరీక్షలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 6 గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కాటూరు లక్ష్మీనారాయణ తెలిపారు. 8వ తరగతి చదివే విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. ఈ మేరకు శనివారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు ఉన్నారు.

## ప్రమాదాల నివారణకు డ్రమ్ములు ఏర్పాటు

**ప్రజాశక్తి-పంగులూరు**

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు, బ్లాక్ స్పాట్స్ దగ్గర డ్రమ్ములు ఏర్పాటు చేసి, వాటికి రేడియం స్టిక్కర్లు అంటించినట్టు రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, శనివారం నో యాక్సిడెంట్‌డే సందర్భంగా, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా, హైవే మీద గతంలో యాక్సిడెంట్లు జరిగిన బ్లాక్ స్పాట్స్ దగ్గర డ్రమ్ములు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 40 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఈ - చలానా విధించామని ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు.

## పాఠశాల పూర్వ విద్యార్థి దాతృత్వం

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పేరం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం మార్టూరులోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 180 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా పేరం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇదే పాఠశాలలో తాను, తన భార్య ఉయ్యాల నాగకుమారి పదో తరగతి చదువుకున్నామని విద్య అభ్యసించిన పాఠశాలలోనే తన భార్య ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పనిచేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ పాఠశాలలో విద్య అభ్యసించిన ఎంతో మంది నేడు అత్యున్నత స్థానాలలో ఉన్నారని అన్నారు. జరగ బోయే పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుడ్డు డేవిడ్, ఉపాధ్యాయులు ధూళిపాళ్ల సుబ్బారావు, జాగర్లమూడి ఆంజనేయులు, కామేశ్వరమ్మ, ఉయ్యాల నాగకుమారి, జ్యోత్స్న, అనురాధ, శ్రీదేవి రాజ్యలక్ష్మి, శేషగిరి, నంబుల్ కుమార్, రవిబాబు, నాగ సుబ్బారావు, పిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి-బాపట్ల**

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్యాన్ని పెంచేందుకు బాపట్ల సాల్వేషన్ ఆర్మీ పారిశ్రామిక సంస్థలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. బాపట్ల జిల్లా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణ కోర్సులను పూర్తిచేసి ప్రభుత్వం జారీ చేసే ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు.

## 27న పంగులూరులో ఆసరా సభ

**ప్రజాశక్తి-పంగులూరు**

ఈ నెల 27వ తేదీన సోమవారం పంగులూరు గ్రామంలో ఆసరా సభ జరుగుతుందని ఏపిఎం జ్యోతి ప్రసాదు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా గ్రూప్ మహిళలకు రుణమాఫీలో భాగంగా, శనివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదల చేశారని, ఆ సందర్భంగా పంగులూరు మండల స్థాయిలో డ్వాక్రా మహిళలకు వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాప్ నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణ చైతన్య ఆసరా పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని

# లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ విజయకృష్ణన్



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

మీ పిల్లల ఉన్నత భవిష్యత్తుకు చక్కని బాటలు వేయడానికే ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోందని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభ్యులు కోన రఘుపతి, కలెక్టర్ చేతుల మీదుగా పొదుపు మహిళలకు చెక్కు రూపంలో నగదును పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ చెప్పారు. 30,604 పొదుపు సంఘాలలోని మూడు లక్షల మంది మహిళలకు రూ.263.61 కోట్లు నిధులు విడుదల అయ్యాయన్నారు. ముఖ్యంగా మీ పిల్లలను బాగా చదివించాలన్నారు. 18సంవత్సరాలు దాటే వరకు ఆడపిల్లలకు వివాహాలు చేయరాదన్నారు. మీ కుమార్తెలు బాగా చదువుకుని పోటీ ప్రపంచంలో అన్ని ఆటంకాలు దాటుకుని ఉన్నత స్థాయికి చేరుకునేలా మీరు సహకరించాలన్నారు. మీరు బాగుంటే, మీ కుటుంబాలు, మీ కుమార్తెలు, తదుపరి తరాలు బాగుంటాయని కలెక్టర్ తెలిపారు. మహిళలను పోషణ కర్తలుగా చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతగానో కషి చేస్తున్నారని ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఎదగడానికి అన్ని అవకాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్పిస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి 32 పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. ఆర్థిక, రాజకీయ రంగంలోను మహిళలకు సమాన హక్కులు, హెూదా కల్పిస్తున్నారని వివరించారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని అడుగులు ముందుకు వేయాలన్నారు. మహిళల సంక్షేమంతోనే రాష్ట్రంలోని అన్ని కుటుంబాలు సంరక్షణలో ఉంటాయన్నారు. మంచి పాలన సాగిస్తూ అనతి కాలంలోనే దేశంలో ఓ ప్రత్యేకతను సంతరించుకున్నారని వివరించారు. ప్రజల మనసుల్లోనూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజలకు నేనున్నానంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోధైర్యం కల్పిస్తున్నారని చెప్పారు. ఆర్థిక వనరులు పెరిగే కొద్దీ ప్రతి ఒక్కరి జీవితంలో పొదుపు భాగం కావాలని సూచించారు. కుల, మత, రాజకీయ వివక్షత లేని పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందిస్తున్నారని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. వై ఎస్ ఆర్ ఆసరా మూడో విడత నగదు పంపిణీ మహిళల జీవితాలను మార్చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ మహిళల అప్పులు తీర్చారని గుర్తు చేశారు. అందులో భాగంగా బాపట్ల నియోజకవర్గంలోని పొదుపు సంఘాల అప్పులు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్ల నిధులను ఇప్పటివరకు విడుదల చేసిందన్నారు. దీంతో పొదుపు సంఘాలన్నీ ఇప్పుడు చక్కగా నడుస్తున్నాయన్నారు. చిన్నారులు, మహిళల సంక్షేమ కోసం అనేక పథకాలను అమలు చేస్తూ మనస్సు ఉన్న ముఖ్యమంత్రిగా నిలిచారని ఆయన చెప్పారు. ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటాన్ని మహిళలు అదష్టంగా భావించాలన్నారు. మహిళల పక్షపాతి ప్రభుత్వంగా, పక్షపాతి సీఎం గా రాష్ట్రంలో చెరగని ముద్ర వేసుకున్నట్లు ఆయన పునరుద్ఘటించారు. మహిళల ఆర్థిక అభివద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి విశేషంగా కషి చేస్తున్నారని అభివర్ణించారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు పండుగ వాతావరణంలో మహిళలకు నగదు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పీడీ బి.అర్జునరావు, ఎల్ డి ఎం కష్ణ నాయక్, డిపిఎం లక్ష్మణాచారి, వైకెపి అధికారులు పాల్గొన్నారు.

'మార్కాపురం' జిల్లా సాధన కోసం..

# నేటి నుంచి 'కందుల' పాదయాత్ర

మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మరోసారి పాదయాత్రీకుడుగా ప్రజల వద్దకు వెళ్లనున్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, మార్కాపురం జిల్లా సాధన కోసం 'ప్రజా చైతన్య యాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ క్షేత్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆదివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం నాడు స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం 20 రోజుల పాటు సాగే ఈ పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో టిడిపి ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, మార్కాపురం మండల టిడిపి అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, తర్లుపాడు మండల టిడిపి అధ్యక్షుడు ఉడుముల చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు

అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ వర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పోలీసులు అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులను నిర్బంధించారు. నోటీసులు ఇవ్వడంతో పాటు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. అంగన్వాడీల ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, వేతనంలో సగం పెన్షన్లను వర్కర్లకు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్ ఫిట్లను రూ 5 లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వర్కర్లపై వేధింపులు ఆపాలని, వైయస్ఆర్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని, హెల్పర్స్ ప్రమోషన్లకు వయోపరిమితిని 50 సంవత్సరాలకు పెంచాలన్న డిమాండ్లను అంగన్‌వాడీలు ప్రభుత్వం ముందు ఉంచారు.

అధికారంలోకి రాకముందు అంగన్వాడి వర్కర్లకు అనేక హామీలను ఇచ్చిన అధికారపార్టీ నేతలు అధికారం చేపట్టాక వాటిని మరిచిపోయి నియంత పాలనను కొనసాగిస్తున్నారని అంగన్‌వాడీలు ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కేయాలని రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ర్యాలీలు, సభలను నిషేధిస్తూ జీవో నెంబర్.1ని తీసుకువచ్చిందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు, ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక మరియు ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భద్రతగా ఉంటుందని ప్రభుత్వం వద్ద దాచుకున్న జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర నగదును తమకు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు కేటాయించిన బడ్జెట్‌లోని మొత్తాలను తమకు ఎందుకు చెల్లించదని ప్రశ్నిస్తున్నారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం మాత్రమే తాము ఉద్యమం చేస్తున్నామని, హక్కుగా తమకు రావాల్సిన ఆర్థికపరమైన చెల్లింపులు, ఇతర సమస్యలు పూర్తిగా నెరవేర్చే వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, వర్క్‌టూ రూల్ లాంటి ఉద్యమ కార్యాచరణ ఉంటుందని ప్రతి ఒక్క ఉద్యోగీ దశల వారీ ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

అసెంబ్లీలో కొండేపి శాసనసభ్యులు బాల వీరాంజనేయస్వామిపై దాడికి నిరసనగా టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రిటీష్ కాలం నాటి చీకటి జీవో నెం-1 తీసుకొచ్చి ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కుతుంటే, దానిపై చర్చించాలని టీడీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. జీవోనెం-1 కేవలం జగన్మోహన్ రెడ్డి రక్షణ కోసం తీసుకొచ్చిందేనని, దానిపై చర్చకు టీడీపీ శాసనసభ్యులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి జీవోనెం-1పై చర్చించాలంటూ ప్లకార్డు పట్టుకొని నిరసన తెలుపుతుంటే సంతనూతలపాడు శాసనసభ్యులు సుధాకర్‌బాబు దాడి చేయడం అత్యంత దౌర్భాగ్యకరమని దేశం నేతలు పేర్కొన్నారు.

బాపట్ల, ప్రకాశం జిల్లాల మీదుగా పెద్ద ఎత్తున గంజాయి తరలిపోతుంది. జిల్లాల్లో కూడా అక్రమ గంజాయి విక్రయాలు విస్తృతంగా సాగుతున్నాయి. ఒరిస్సా, విశాఖపట్నం ప్రాంతంలోని అటవి ప్రాంతం నుంచి గంజాయి తరలి వస్తుంది. పోలీసులు దాడులు చేసి వందల కిలోల కొద్ది గంజాయిని పట్టుకుంటున్నారు. దొరికేది గోరంత, తరలి వస్తుంది కొండంతగా ఉంది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన కోసం గంజాయి అమ్మకాలను కొందరు సాగిస్తున్నారు. గత వారం బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి 140 కిలోల గంజాయితో వెళుతున్న కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరిగి వారంలోనే మరో 180 కిలోల గంజాయిని, లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులు, యువత కూడా గంజాయి మహమ్మారికి అలవాటు పడుతున్నట్లు తెలుస్తున్న క్రమంలో పోలీస్ యంత్రాంగం కళాశాలల్లో విద్యార్థులకు వీటి పర్యవసానాలు వివరించడం కోసం 'సంకల్పం-డ్రగ్స్‌కు వ్యతిరేఖంగా పోరాటం' అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. యువతను డ్రగ్స్‌కి బానిసలుగా అవడం వల్ల వారి భవిష్యత్ అగమ్యగోచరం అవుతుంది. కొత్త పరిచయాలు కొత్త స్నేహాలతో కాలక్రమంలో కొందరు డ్రగ్స్‌కి కూడా అలవాటు అవుతున్నారు.

**- ప్రజాశక్తి, బాపట్ల**

మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పేరయ్య

ఆప్షన్-3 పద్ధతిలో..

# మేస్త్రీలు గృహాలు నిర్మించొచ్చు..

## గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పేరయ్య

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల గృహాలు ఆప్షన్-3 పద్ధతిలో తాపీ మేస్త్రీలు నిర్మించేందుకు అవకాశం కల్పించినట్లు గృహ నిర్మాణ సంస్థ పిడి పేరయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో పట్టణంలోని తాపీ మేస్త్రీలతో అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ ఆప్షన్-3 పద్ధతి ద్వారా తాపీ మేస్త్రీలకు ఉపాధి లభిస్తుందన్నారు. లబ్ధిదారులకు గృహం త్వరగా పూర్తవుతుందన్నారు. పట్టణ పరిధిలోని చెన్నరాయునిపల్లి, నాగులవరం రోడ్డులోని జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ సంస్థ నుంచి రూ. 1.80లక్షలు, మరో రూ. 30వేలుఉ మెప్మాద్వారా ఇప్పించడం జరుగుతుందన్నారు. రూ. 2.10లక్షలతో గృహం నిర్మించాలన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాలనీల్లో సౌకర్యాలు కల్పిచండం జరుగుతుందన్నారు. తాపీమేస్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్, గృహ నిర్మాణ సంస్థ ఇఇ వెకంటస్వామి, డిఇ పవన్, ఏఇ సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ.8 లక్షల విలువైన 180 కిలోల గంజాయి స్వాధీనం
- బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడి

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

జిప్సం లోడు మాటున అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాని మార్టూరు సీఐ షేక్ థెరిసా ఫిరోజ్ ఆధ్వర్యంలో ఎస్ఐ కోడూరు కమలాకర్ పోలీస్ సిబ్బందితో అత్యంత చాకచక్యంగా వలపన్ని లారీలో తరలిస్తున్న రూ.8 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, చాగల్లు ఏరియాకి చెందిన సయ్యద్ రజాక్‌కి చెందిన లారీలో డ్రైవర్ కాకాటి లోవ రాజు, క్లినర్ పీతాని నాగఅప్పారావు వైజాగ్ లోని కోరమండల్ ఇండస్ట్రియల్ లిమిటెడ్ నందు జిప్సం లోడు వేసుకొని, కర్నాటక రాష్ట్రం గుల్బార్గా కి బయలుదేరారు. మార్గమధ్యలో అనకాపల్లిలో యజమాని రజాక్ లారీని వేరే చోటికి తరలించి అక్కడ జిప్సం లోడు అడుగు భాగాన 6 బస్తాల గంజాయిని లోడు చేసి లారీని జగ్గంపేట ఏరియా ఎర్రవరం టోల్ గేటు సమీపంలో డ్రైవర్ లోవరాజుకి తిరిగి అప్పగించాడు. లారీలో జిప్సంలోడు మధ్యలో గంజాయి గోతాలున్నాయని చెప్పి సరుకు తీసుకునే వ్యక్తి ఫోన్ నెంబరు ఇచ్చి అతను ఎక్కడ లోడు దించాలో ఫోన్ చెప్తాడని సరుకు దించిన వెంటనే సదరు వ్యక్తి రూ. 20 వేలు నగదు ఇస్తాడని దానిని పంచు కోవలసిందిగా డ్రైవర్ లోవరాజుకి తెలపడంతో సరే అనే లోడు తీసుకొని బయలుదేరారు. ఈ క్రమంలో వీరి లారీ బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే అప్పటికే గంజాయి లోడు అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న మార్టూరు సీఐ షేక్ థెరిసా ఫిరోజ్,ఎస్ఐ కమలాకర్,తహశిల్దార్ బత్తుల వెంకటరెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న ముద్దాయిలు పోలీసులను చూసి లారీ ని ఆపుకొని అక్కడి నుండి పారిపోయే ప్రయత్నం చేయడం గమనించిన సీఐ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్ ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కాగా పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకొని ప్రతిభ కనపరిచిన మార్టూరు సి.ఐ. షేక్.టి.ఫిరోజ్, ఎస్ఐ కె.కమలాకర్ ఏఎస్ఐ లు షేక్ సైదా,మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ లు సుబ్బారావు, కోటేశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది రాజేష్,గురవయ్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.